**269వ అధ్యాయం**

# ٢٦٩ - بَابُ النَّهْيِ عَنِ التَّبَاغُضِ وَالتَّقَاطُعِ وَالتَّدَابُرِ

# పరస్పరం పగతో, సంబంధాలు త్రెంచుకొని ఎడమొహం పెడమొహంతో ఉండరాదు

قَالَ اللهُ تَعَالَى: ﴿إِنَّمَا ٱلْمُؤْمِنُونَ إِخْوَةٌ﴾ [الحجرات: ١٠]. وقالَ تعالى: ﴿أَذِلَّةٍ عَلَى ٱلْمُؤْمِنِينَ أَعِزَّةٍ عَلَى ٱلْكَٰفِرِينَ﴾ [المائدة: ٥٤]. وقالَ تعالى: ﴿مُّحَمَّدٌ رَّسُولُ ٱللَّهِ وَٱلَّذِينَ مَعَهُۥٓ أَشِدَّآءُ عَلَى ٱلْكُفَّارِ رُحَمَآءُ بَيْنَهُمْ﴾ [الفتح: ٢٩].

దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"విశ్వాసులు పరస్పరం అన్నదమ్ములు."

*(అల్‌హుజురాత్:10)*

"వారు విశ్వాసుల పట్ల మృదువుగానూ, అవిశ్వాసుల పట్ల కఠినంగానూ ప్రవర్తిస్తారు."

*(మాయిదా:54)*

"ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త. ఆయన వెంట ఉన్నవారు, అవిశ్వాసుల పట్ల కఠినులుగానూ, పరస్పరం కరుణామయులుగానూ ఉంటారు."

*(అల్‌ఫతహ్:29)*

١٥٦٩ - وعنْ أَنسٍ رَضِيَ اللهُ عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «لَا تَبَاغَضُوا، وَلَا تَحَاسَدُوا، وَلَا تَدَابَرُوا، وَلَا تَقَاطَعُوا، وَكُونُوا عِبَادَ اللهِ إخواناً، وَلَا يَحِلُّ لِمُسْلِمٍ أَنْ يَهْجُرَ أَخَاه فَوقَ ثَلاثٍ» متفقٌ عليه.

1569. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: పరస్పరం పగ బట్టకండి. అసూయ చెందకండి. ఎడ మొహం పెడమొహంతో ఉండకండి. సంబంధాలు త్రెంచుకోకండి. దైవ దాసులారా! పరస్పరం అన్నదమ్ము లుగా ఉండండి. ఒక ముస్లిం తోటి (ముస్లిం) సోదరునితో మూడ్రోజులకు మించి మాట్లాడకుండా ఉండరాదు.

(బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ బుఖారీలోని అదబ్ ప్రకరణం- సహీహ్ ముస్లింలోని బిర్ర్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

పరస్పరం పగబట్టకండి అంటే హృదయాల్లో ప్రతీకార, విరోధ భావాలను పెంచే మాటలకు, పనులకు దూరంగా ఉండండి అని అర్థం. అసూయ చెందకండి అంటే ఒక ముస్లింకు ఏదయినా వరంగాని లేక హోదా అంతస్తులుగాని లభిస్తే అవి క్షీణించిపోవాలని కోరుకోకండి అని అర్థం. ఎడమొహం పెడమొహంతో ఉండకండి అంటే పరస్పరం ఎదురుపడినప్పుడు కనీసం సలాం అయినా చేసుకోకుండా మొహం తిప్పుకొని వెళ్లిపోకండి అని అర్థం. వీటివల్ల మనుషుల్లో అంతరాల అగాధాలు పెరిగిపోతాయి. సామాజిక జీవితం ఛిన్నాభిన్నమైపోతుంది. కనుక మనుషులు మూడ్రోజులకు మించి తెగత్రెంపులు చేసుకొని మాట్లాడకుండా ఉండటం ధర్మసమ్మతం కాదు.

1570. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: సోమ, గురు వారాల్లో స్వర్గద్వారాలు తెరువబడతాయి. ఆ రోజు అల్లాహ్‌తోపాటు సహవర్తుల్ని నిలబెట్టని ప్రతి ఒక్కరి పాపాలూ మన్నించబడతాయి. కాని తనకూ తన తోటి (ముస్లిం) సోదరునికి మధ్య శత్రుత్వమున్నవాని పాపాలు మాత్రం మన్నించబడవు. వారి గురించి "వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగు పరచుకునేదాకా గడువు ఇవ్వండి! వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగు పరచుకునేదాకా గడువు ఇవ్వండి" అని అనటం జరుగుతుంది. (ముస్లిం)

ముస్లింలోని వేరొక ఉల్లేఖనంలో "ప్రతి సోమ గురువారాల్లో కర్మలు ప్రవేశపెట్ట బడతాయి" అని ఉంది. ఆ తర్వాతి హదీసు అంతా యథాతథంగానే ఉంది.

*(సహీహ్ ముస్లింలోని బిర్ర్ ప్రకరణం)*

١٥٧٠ ـ وعنْ أبي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قالَ: «تُفْتَحُ أَبْوَابُ الجَنَّةِ يَوْمَ الاثْنَيْنِ وَيَوْمَ الخَمِيسِ، فَيُغْفَرُ لِكُلِّ عَبْدٍ لَا يُشْرِكُ بِاللهِ شَيْئاً، إِلَّا رَجُلاً كَانَتْ بَيْنَهُ وَبَيْنَ أَخِيهِ شَحْنَاءُ فيقالُ: أَنْظِرُوا هٰذَيْنِ حَتَّى يَصْطَلِحَا! أَنْظِرُوا هٰذَيْنِ حَتَّى يَصْطَلِحَا!» رواه مسلم. وفي روايةٍ له: «تُعْرَضُ الأَعْمَالُ في كُلِّ يَوْمِ خَمِيسٍ وَاثْنَيْنِ» وَذَكَرَ نَحْوَهُ.

## ముఖ్యాంశాలు

పరస్పరం శత్రుత్వం, విద్వేష వైషమ్యాలు కలిగి ఉండటం స్వర్గ అనర్హతకు కారణభూతమవుతుందని ఈ హదీసు హెచ్చరిస్తోంది.